క్లుప్తంగా

మానసాదేవికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: మండల కేంద్రంలోని పవనగిరి క్షేత్రంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా మానసాదేవికి విశేష పూజలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో లంకా అయ్యప్ప శర్మ పౌరోహిత్యంలో అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చినట్టు క్షేత్రం వ్యవస్థాపకులు వెంకటరామయ్య చెప్పారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటపూర్ణిమ

హుకుంపేట: మండలంలోని దాలిగుమ్మడిలో జనవరి 14,15,16 తేదీల్లో నిర్వహిస్తున్న తుమ్మరమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు క్రీడలతో మానసిక ఉల్లసం కలుగుతుందని, యువత క్రీడారంగంలో ఆశక్తి చూపించాలన్నారు. నిర్వాహకులు అజయ్, విఘ్నేష్, వార్డు సభ్యులు వెంకట్, నాగబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సూరిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు సాయి, చిట్టిబాబు, గౌతమ్, విశ్వనాథం, రామయ్య, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం



రైతుకు సాయమందిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నయ్యపడాల్


చింతపల్లి: కూటమి ప్రభుత్వం రైతాంగానికి సహాయం అందించడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ విమర్శించారు. ఆయన ఆదివారం చింతపల్లి పంచాయతీ పరిధిలోని రైతుల కళ్లాలకు వెళ్లి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. గిరిజన గ్రామాల్లో నేటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకోవలసిన దుస్థితి నెలకొందన్నారు.
ఒక్కో రకం ధాన్యాన్ని ఒక్కో ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, దీంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శివారు ప్రాంతాల్లో పొలాలకు సాగు నీరందక వందలాది ఎకరాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్తులాటలో 17 మంది అరెస్టు

- 8 బైక్లు, రూ.2.33 లక్షలు స్వాధీనం

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరం శివారున చిత్తులాట(హెడ్అండ్‌టైల్ కాయిన్) కేంద్రంపై దాడి చేసి 17 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ బి.వినోద్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.2.33 లక్షలు నగదు, 8 బైక్ లు స్వాధీనపర్చుకున్నట్టు చెప్పారు. ఎల్లవరం శివారులో పెద్ద ఎత్తున చిత్తులాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

జలపాతాలు చూసొద్దామా..



జి. మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం



దుంబ్రిగుడలో చాపరాయి జలపాతం

- మన్యం పర్యాటకధామం
- వాటర్‌ఫాల్స్‌తో మంత్రముగ్ధులవుతున్న ప్రకృతి ప్రేమికులు
- కటికి, తాడిగుడ, చాపరాయి, రణజిల్లెడ, డుడుమ, కొత్తపల్లి, గొడుగురాయి, పిట్టలబొర్ర ప్రాంతాల్లో
- పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య

అరకులోయటౌన్: ఆంధ్ర ఊటీగా పేరొందిన అరకులోయ పర్యాటకధామంగా పేరొందింది.. ఇక్కడ ఎత్తైన కొండలు.. పచ్చని పచ్చిక బయళ్లు... కొండలను తాకుతున్న మబ్బులు.. ఇలాంటి కమనీయ దృశ్యాలు..ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు ఇక్కడి ఎత్తైన కొండల నుంచి పాలునురుగులా జాలువారుతున్న జలపాతాల అందాలు కట్టిపడేస్తున్నాయి. ఇక్కడి ప్రకృతి సోయగాలను ఆస్వాదించడానికి జిల్లా, వివిధ రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు తరలి వస్తున్నారు. శీతాకాలం వచ్చిందంటే మన్యం..ప్రకృతి అందాలకు ఆలవాలయంగా మారుతోంది.. పర్యాటకులు ఇక్కడి వాతావరణానికి పరవశిస్తున్నారు.

సందడే.. సందడి

అరకులోయకు విచ్చేస్తున్న పర్యాటకులకు రైలు మార్గం, రోడ్డు మార్గాన్న విచ్చేసే ప్రకృతి ప్రేమికుల్ని ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు, ఎత్తైన కొండలు,లోయలు కట్టి పడేస్తుంటాయి. ఇక్కడి సందర్శిక ప్రాంతాలను తిలకించేందుకు విచ్చేస్తున్న పర్యాటకులకు మన్యం జలపాతాలు ఆకట్టుకుంటున్నాయి. తెల్లటి పాలనురుగను తలపించేలా కొండ ఎగువ ప్రాంతాల బండ రాళ్ల నుంచి జాలువారుతున్న జలాల్లో పర్యాటకులు జలకాలాడుతూ ఆనందాన్ని పొందుతున్నారు. సాయంత్రం వరకు సందడి చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతతో తీవ్ర ఇబ్బందులు పడే మైదాన ప్రాంత పర్యాటకులు ఇక్కడి జలాపాతాల్లో కొద్ది సేపు జలాకాలాడి పరిసర సందర్శిత ప్రాంతాల్లో పర్యటించి మధురానుభూతి పొందుతున్నారు.

జలపాతాల హోయలు

- దుంబ్రిగుడు మండలంలో ఉన్న చాపరాయి జలపాతం నిత్యం పర్యాటకులతో కళకళలాడుతోంది. అరకులోయ నుంచి పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో అరకు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ బండ రాళ్లపై నుండి జారుడు బల్లలా జారువాలుతున్న నీటిలో చిన్న, పెద్ద లేడా లేకుండా జారుతూ సరదాగా గడుపుతారు. ఇక్కడ పెద్దలకు రూ. 60, పిల్లలకు రూ. 30 ఎంట్రీ టిక్కెట్ వసూలు చేశారు.
- జి. మాడుగుల మండలం నుంచి చింతపల్లి వెళ్లే మార్గంలో జి.మాడుగులకు 8 కిలోమీటర్ల దూరంలో కొత్తపల్లి జలపాతం ఉంది. ప్రస్తుతం ఈ జలపాతం పాడేరు ఐటీడీఏ ఆధీనంలో ఉంది. ఈ జలపాతం చూపరులకు ఎంతో ఆకట్టుకుంటుంది. నిత్యం పర్యాటకులు ఇక్కడికి తరలివస్తుంటారు.
- పెదబయలు మండలంలోని పిట్టల బొర్ర జలపాతం పెదబయలు మండల కేంద్రం నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. వయా రూడకోట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. సుమారు 140 అడుగుల పై నుంచి బండరాళ్ల నుండి జాలువారే ఈ జలపాతం ఇదొక వ్యూ పాయింట్ మాత్రమే. ఈ జలపాతం ప్రమాదకరమని స్నానాలు చేయవద్దని హెచ్చరికలు బోర్డులు ఏర్పాటుచేశారు.
- హుకుంపేట మండలంలోని తీగలవలస సమీపంలో గొడుగురాయి జలపాతం ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో ఉంది. వయా కామయ్యపేట మీదుగా తీగలవలస వెళ్లాలి. హుకుంపేట మండల కేంద్రం నుండి 9 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. హుకుంపేట మండల కేంద్రం నుంచి ఆటోలు, జీపుల్లో అక్కడికి చేరుకోవచ్చు.


ప్రకృతి పరవశం.. డుడుమ జలపాతం

- ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని ముంచంగిపుట్టు మండలంలో ఉన్న డుడుమ జలపాతం అత్యంత సుందరనీయ జలపాతం చూపరులకు ఎంతో ఆకట్టుకుంటోంది. ముంచంగిపుట్టు మండలం నుంచి తంగడ రహదారి మీదుగా 30కిలోమీటర్ల దూరంలో డుడుమ జలపాతం ఉంది. పాడేరు ఆర్టీసీ డిపో నుంచి డుడుమ జలపాతానికి చేరేందుకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల బస్సు సౌకర్యం ఉంది. ఇది ఒక వ్యూపాయింట్ ఉంది.



ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని డుడుమ జలపాతం

అద్భుతం..కటికి, రణజిల్లెడ జలపాతాలు



- బొర్రా అందాలు తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఇక్కడ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కటికి జలపాతం ఉంది. యువత జలకాలాడుతూ ఉల్లాసంగా గడుపుతారు. ఈ జలపాతం పైకి ఎక్కకూడదు. ప్రమాదవశాత్తు జారిపడితే ఒక మృత్యు ఒడిలోకే.
- బొర్రా గేటువలస గ్రామం నుంచి కటిక జపాతం వరకు ట్రో సంస్థ ఏర్పాటు చేసే జీపుల్లో మాత్రమే పర్యాటకులను రైల్వే ట్రాక్ వరకు తీసుకొస్తారు. రైల్వే ట్రాక్ నుంచి ఒక కిలోమీటరు వరకు కాలినడకన చేరుకోవాలి. ఎంట్రీ ఫీజు రూ.30గా గ్రామ పంచాయతీ నిర్ణయించింది.
- అరకులోయ మండలం సుంకరమెట్ట మీదుగా కటికి జలపాతానికి 6కిలోమీటర్లు. రోడ్డు సౌకర్యం ఉంది. నేరుగా జలపాతం వరకు వెళ్లవచ్చు.
- అనంతగిరి మండల కేంద్రం నుంచి కేవలం 2 కిలో మీటర్ల దూరంలో తాడిగుడ జలపాతం ఉంది. ఈ జలపాతంలో నిత్యం పర్యాటకులతో కళకళలాడుతుంది.
- అరకులోయకు అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రణజిల్లెడ జలపాతం ఎంతో ఆకట్టుకుంటోంది. ఇక్కడ పెద్దలు మాత్రమే నీటిలో దిగి స్నానం చేస్తుంటారు. బండ రాళ్ల పైకి ఎక్కడం వంటివి చేయరాదు.

400 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో నిర్వాహకులు, వైద్యులు తదితరులు

రంపచోడవరం : మండల కేంద్రంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 400 మందికి వైద్య సేవలు అందించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, మిషన్ మేనేజర్ స్వామి రఘువీరనంద మహారాజ్ తెలిపారు. వైద్యులు జి.వి.రామారావు, కె.సుబ్రహ్మణ్యం, రాయుడు శ్రీనివాస్, సంపత్‌కుమార్ తదితరులు రోగులను పరీక్షించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శిబిరంలో క్యాంప్ కో -ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, భగీరథరాజు. చంద్రశేఖర్, మంగిరెడ్డి, రామకృష్ణ, సంజీవ్, చంద్రశేఖర్ , మల్లికార్జునరావు సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతానికి పర్యాటకుల తాకిడి



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పలు ప్రాంతాల నుంచి ఆదివారం బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాల్లో పర్యాటకులు వచ్చారు. ఇక్కడ పెద్ద పెద్ద బండరాళ్లపై నుంచి జాలవారుతున్న నీటి ప్రవాహంలో ఉల్లాసంగా స్నానాలు చేశారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ గంటల తరబడి ఆనందంగా గడిపారు. జలపాతాల వద్ద వ్యూపాయింట్, ఇతర ప్రాంతాల్లో సెల్ఫీలు, ఫొటోలు తీస్తూ సందడి చేశారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

చింతపల్లి: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భక్తుడు దుర్గా నగేష్, పద్మ దంపతుల సహాయ సహకారంతో భారీ అన్నసమారాధన జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు



విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్ సుష్మిత, నాయకులు

అరకులోయటౌన్: అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గురించి మాట్లాడేస్థాయి తెలుగు దేశం పార్టీ అరకు నియోజకవర్గ అధికార ప్రతినిధి నీరజకు లేదని పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుష్మిత స్పష్టం చేశారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో హామీలిచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు ఏ ఒక్క హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చి అమలుచేయకుండా సైకోలా వ్యవహరిస్తూ, ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నా టీడీపీ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. అరకులోయ పట్టణంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా..ప్రయాణకులు, వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం ప్రత్యేక చొరవతో మంచి పనులు చేస్తుంటే టీడీపీ నాయకులు తప్పుపట్టడం దారుణమన్నారు. అత్యధిక ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన ఆదివాసీ ముద్దుబిడ్డ మత్స్యలింగం జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎంపీటీసీ సభ్యులు దురియా ఆనంద్, సమర్థి శత్రుఘ్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి జన్ని నరసింహమూర్తి, నాయకులు పాంగి నగేష్, స్వాభి రామ్మూర్తి, రామారావు, స్వాభి రాంచందూర్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



అరకులోయలో డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది



అనంతగిరిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ నీలవేణి, ఎంపీడీవో కుమార్ తదితరులు

పాడేరురూరల్(అరకులోయ రూరల్): మండల కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రసూల్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన త్యాగం మరవలేనిదన్నారు. అమరజీవి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కోటేశ్వరరావు, మురళీధర్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి(అరకులోయటౌన్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు.చింతపల్లి పంచాయతీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, తాజంగి పంచాయతీలో కార్యదర్శి శ్రీధర్ పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన త్యాగాలను పలువురు కొనియాడారు. సీనియర్ అసిస్టెంట్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళిలర్పిస్తున్న సర్పంచ్ దురియా పుష్పలత

రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న నాయకులు

దుంబ్రిగుడ: గుంటసీమ పంచాయతీ సరియావలస గ్రామంలో శారదా ట్రస్టు, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సుమారు 50 మంది గిరిజన కుటుంబాలకు ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎస్.బి పోతురాజు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు టి.సూర్య నారాయణలు గ్రామస్తులకు రగ్గలను అందజేశారు. వారు మాట్లాడుతూ గిరిజనులు చలి బారి నుంచి రక్షణ పొందేందుకు శారద ట్రస్టు ఆధ్వర్యంలో అందజేస్తున్నమన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలు



ప్రభుత్వ భూమిలో తవ్వకాలు

చింతూరు: ప్రభుత్వ భూమిలో తెల్లరాయి తవ్వేందుకు వినియోగిస్తున్న పొక్లెయిన్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ చిరంజీవి ఆదివారం తెలిపారు. మండలంలోని సింగన్నగూడెంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబరు-11లో తెల్లరాయి తవ్వకాలు జరుపుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ రమేష్‌తో కలసి పరిశీలించినట్టు ఆయన తెలిపారు. ఆ ప్రదేశంలో తెల్లరాయి లోడుతో ఉన్న టిప్పర్, తవ్వకాలకు వినియోగిస్తున్న పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో పాల్గొని మద్దతు తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): గత నెలరోజులుగా పాడేరు జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఎదురుగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్షకు ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకుల మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ నెల రోజులుగా దీక్షలు చేపడుతున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు దొంగహామీలిచ్చి ఇప్పుడు అమలుచేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకుల దీక్షలతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నా సీఎం చంద్రబాబు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గిరిజన సంక్షేమ గురుకుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపడుతున్న దీక్షకు మద్దతుగా ఈనెల 18న పాడేరులో చేపడుతున్న సభకు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజశేఖర్, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులపై ప్రభుత్వం కక్షసాధింపు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు



సమవేశంలో పాల్గొన్న కాంట్రాక్టు ఉద్యోగులు

పాడేరురూరల్(అరకులోయ రూరల్): రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్దతిలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నర్సస్ స్ట్రగుల్ కమిటీ, వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రం స్థానిక పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో ఆదివారం ఏపీ నర్సస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సమవేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, వివిధ విభాగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తునందన్నారు. ఉద్యోగులందరికి వందశాతం వేతనాలు చెల్లించాలవని కాంట్రాక్టు ఉద్యోగులందరికి పర్మినెంట్ చేయాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి వేధింపులు ఆపాలన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చి అధికారంలో వచ్చాక వాటిని గాలికి వదిలి కాలయాపన చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేసి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమిస్తామన్నారు. రాంబాబు, ధనలక్ష్మి, దీనకుమారి, వసంత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రక్షణ గోడలు లేని వంతెన ఇదే

గంగవరం: గోకవరం- అడ్డతీగల రూట్‌లో నెల్లిపూడి-పాతరామవరం వద్ద గల నెల్లిపూడి వాగుపై ఉన్న వంతెన పై రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఆరు నెలల క్రితం ఈ వంతెనపై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు ఓ గిరిజనుడు బైక్‌తో వాగులో పడిపోయి మృత్యువాత పడ్డాడు. రాత్రి సమయాల్లో ఈ వంతెనపై ప్రయాణించాలంటే భయమేస్తుందని వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వంతెనపై రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం ప్రతిష్టాపన



ధ్వజస్తంభం ప్రతిష్టాపన చేస్తున్న భక్తులు

కూనవరం: మండల కేంద్రంలో కొలువు దీరిన దుర్గాదేవీ ఆలయంలో వేదపండితుల మంత్రోత్సావాల నడుమ ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేదపండితులు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు, భవాని మాలధారులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం 8.30 గంటలకు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అభిషేకాలు, హోమంలో పాల్గొన్న భక్తులు